# సురబాల

ఎడవల్లి రామమూర్తిగారు

౧

నేను సురబాలతో కలిసి మాయింటికి ఒకసందగ్గజాలమారంలోవున్న వీధిబడికి వెడుతూండేవాణ్ణి. అక్కడ ఏదో కాస్త గుసగుసలాడి బడిపంతులకంట్లో కారంకొట్టి చెప్పకుండా యిద్దరం సురబాలయింటికి వెళ్ళేవాళ్ళం. నేను ఆపిల్లయింటికెప్పుడెళ్లినా వాళ్లమ్మ మమ్మలిద్దర్ని వరుసగనుంచోబెట్టి 'వీళ్లకు యీడూ జోడూ సరిపోయింది' అని తనలో తనేమురిసేది. అప్పట్లో నేను యెంత చిన్నవాణ్ణయినా, ఆమె అన్న మాటల్లో అర్థం గ్రహించకపోలేదు. అదేవిటోగాని అప్పట్నుంచీ సురబాలమీద ప్రపంచకం అందరికంటె నాకురెక్కువ హక్కుందనుకునేవాణ్ణి. ఈవిషయం మొదట నాలో చిన్న మొలకై క్రమంగా పెరిగి పెద్ద వృక్షమైంది. అంచేత సురబాల నావస్తువేకదాయని ఆమెనొక్కసారి కసిరి మనసు చిన్నబుచ్చేవాణ్ణి. ఆపిల్లకూడా నేనెంత కఠినంగామాట్లాడినా యేమీ అనుకొనేదికాదు. మావూళ్లోవాళ్లందరూ 'సురబాల చక్కనిచుక్క' అనేవారు. అది నాదురదృష్టంకాబోలు నాకళ్లకి ఆమె అంతఅందకత్తెగా కనిపించలేదు. పాపం! ఆమె నానిరసనభావానికి గురియైంది.

౨

మాతండ్రి ఒక జమీందారీమీద మేనేజరు. నేపెరిగి పెద్దవాణ్ణయినతర్వాత తన్నేదో వుద్ధరిస్తాననుకొన్నాడాయన. నేరెండుముక్కలు నేర్చుకొన్నతర్వాత యేయెస్టేటులోనో ఒక గుమాస్తాగా ప్రవేశపెట్టిద్దామని మానాన్నఊహ. కాని ఆయనఅభిప్రాయం నాకు నచ్చేదికాదు. మావూర్నించి భూపేంద్రప్రసాద్ అనే నాస్నేహితుడొకడు కలకత్తాకు పారిపోయి అక్కడ ఇంగ్లీషు బాగాచదువుకొని పెద్ద ఉద్యోగం సంపాదించేడు. అదే నాఆశయంకూడాను. భూపేంద్రుడుకొచ్చినంత పెద్దపదవి రాకపోయినా జడ్జీకోర్టులో హెడ్ గుమాస్తాపనేనా చెయ్యాలనుకొన్నాను. కోర్టుఉద్యోగస్తులంటే మానాన్నకి మహాగౌరవం. ఉద్యోగస్తులెవరైనా మాయింటికొస్తే పంచభక్ష్యపరమాన్నాలతో వాళ్లకు విందుజరిగేది. చిన్నప్పట్నుంచి యిటువంటివన్నీ చూట్టంవల్ల నేనుకూడా యేకోర్టులోనో ఉద్యోగం సంపాదించాలనుకొన్నాను. మావైపున నిజంగా యీవుద్యోగస్తుల్ని దేవుళ్లలాగ పూజిస్తారు. మన ముప్పయిమూడుకోట్లదేవతలు యిప్పటికి యీయుగంలో యిల్లాకోర్టుఉద్యోగస్తులై జన్మించారేమోయని అనిపిస్తుంది. ఈశ్వరుణ్ణిపూజించటం అడుగంటింది సరికదా వీళ్లని ఫలపుష్పాలతో పూజిస్తున్నారు.

ఒకమంచి వీలైనసమయంచూచుకొని కలకత్తా యెవ్వరితోను చెప్పకుండా వెళ్లిపోయాను. ఒకచిన్న పల్లెటూళ్లో మొదట బసచేసివుంటూండగా మానాన్నదగ్గర్నుంచి నాకు పైకంవచ్చింది. ఇంక చదువు ప్రారంభించాను. చదువులోనే యెప్పుడూ మునిగిపోకుండా రాజ్యాంగసంస్థల్లోను, సంఘసంస్కర్తలతోను చేరి కాలం గడుపుతూవుండేవాణ్ణి. అప్పటి వుద్రేకంలో ప్రాణం అర్పించటానికైనా సంశయించేవాణ్ణికాదు. కాని అంతప్రాణం అర్పించవలసినఅవసరమే ఉండేదికాదు. నేనున్నూ ఆవూళ్లోని పిల్లలు కొంతమందిన్నీ కలిసి చాలాదీక్షతో పనిచేసేవాళ్లం. కలకత్తాలో కొందరు విలాసవిద్యార్థులు మమ్మల్నిచూచి నవ్వేవారు. వాళ్లలాగ మేము చంచలబుద్ధివాళ్లంకాదని పాపం వాళ్లు గ్రహించలేదు. మాసంఘనాయకులు ధాటీగా ఉపన్యాసవర్షాలు కురిపిస్తోంటే నేను మరికొందరితో కలిసి, యెండనక, వాననక కాకుల్లాగ అన్నాహారాలు మరచిపోయి, యింటింటికి చందాలుపోగుచెయ్యటానికి తిరిగేవాళ్లం. రోడ్డుపక్కల్నినుంచొని వచ్చేపోయే

వారికి కరపత్రాలందించటం; యేవన్నా యుపన్యాసాలుంటే లెక్చరుహాల్లో బల్లలు, కుర్చీలుసర్దటం; ఎవరైనా మమ్మల్ని గురించిగాని మాసంఘాన్ని గురించిగాని చెడుగుమాట్లాడితే దెబ్బలాటకు సిద్ధమవటం: యివేమాపనులు. మమ్మల్నిచూచి నవీననాగరికవిద్యార్థులు గేలిచేసేవారు-చేయనీ-మనకేం!

నేను కలకత్తా యెందుకొచ్చేను? ఏవో రెండుముక్కలు నేర్చుకొని కోర్టులో ఉద్యోగంవెలిగిద్దామని. కాని నేనిప్పుడు చేసేదేవిటి? ఏమేజినీయో, గరిబాల్డీయో, గాంధీయో అవుదామని.

3

ఇక్కడ పరిస్థితులిట్లావుంటే, నాకు సురబాలకువివాహం స్థిరంచేశారు-మావాళ్లు. నాపదిహేనవయేట నేను కలకత్తావచ్చేను. అప్పటికి సురబాలకు ఎనిమిదేండ్లు. నాకప్పుడే పెండ్లియీడు దాటిపోయిందని విచారిస్తున్నాడు మానాన్న. బ్రతికియున్నంతకాలము బ్రహ్మచారినై దేశసేవచెయ్యాలని నేను యిదివరకే సాహృదయాంతర్భాగములందు నిశ్చయించుకొన్నాను. ఈసంగతి పాపం, మానాన్నకేంతెలుసును? సరే యేమైతే అవుతుందని చదువయ్యేవరకూ పెండ్లిచేసుకోనని మానాన్నకు తెలియజేసెను.

సురబాలకు రామలోచనునకు వివాహమయిందని మూడునెల్లయినతర్వాత నాకు తెలిసింది. దేశసేవ చేసి మాతృదేశాన్నుద్ధరిద్దామని యనుకుంటూన్న నాకు సురబాలవివాహంసంగతి అంత కర్ణకఠోరంగాలేదు. మెట్రిక్యులేషన్ ప్యాసయి యింటర్మీడియట్ పరీక్షకు వెళ్లాలనుకొంటూన్న సమయములో మాతండ్రి స్వర్గస్థుడైనాడు. ఇంక నేనా యేకాకిగాణ్ణికాదు. నాకింకా యిద్దరుచెల్లెళ్లు తల్లి యున్నారు. అందుచేత చదువుకు స్వస్తిచెప్పి ఉద్యోగంయేదైనా స్వీకరించవలసివచ్చింది. ఆనేక తికమకలుపడి యీగడ్డి ఆగడ్డి కొరికి కుట్టుకుడకు తల్లప్రాణం తోకకురాగా నోఖాళీ జిల్లాలోవున్న చిన్నపట్నంలో ఒకస్కూల్లో రెండోమాస్టరుగా ప్రవేశించాను. ఆహా! నాకుతగిన ఉద్యోగందొరికింది! నాబోధనలవల్ల పిల్లన్ని ఉద్రేకపూరితుల్నిచేసి దేశోపకారానికి పనికొచ్చేటట్లు చెయ్యొచ్చు. పనిలోప్రవేశించాను. దేశసేవకంటె నాకు స్కూల్లో పరీక్షలు ముఖ్యమయ్యాయి. కర్మంజాలక యేవన్నా మనదేశాన్నిగురించిచెబితే హెడ్మాస్టరు నన్ను కొప్పడేవాడు. నన్ను ఖైదులోపెట్టినట్లయింది. నాఉత్సాహం అడుగంటింది. ఇంట్లోకూర్చున్నకాస్సేపు నాభావనాతరంగాలు నిరాటంకంగా విల్లువిరిసేవి. కాని స్కూల్లో అడుగెట్టగానే ఆవుద్రేకం మాయమయ్యేది. విధిలేక నాగళ్లక్రింద యెద్దుల్లాగ పనిచెయ్యవలసివచ్చేది. ఉద్రేకపూరితుణ్ణయినప్పుడు రాజకీయ రణరంగానికురుకుదామన్నా వీల్లేదు.

౪

మాస్కూలు ఊరికి ఒకచివరనుంది. స్కూలుపక్కనే ఒక పెద్దచెరువుంది. ఆచెరువుగట్టుమీద ఒకపక్క తమలపాకులతోటలు, యింకొకపక్క లేతకొబ్బరిచెట్లు, మందార మొక్కలు, గన్నేరుచెట్లు యింకా యిటువంటివి లక్షరకాల వృక్షజాతులున్నాయి. మాబడిదగ్గరనే ఒక తాటాకులయింట్లో నేనుంటున్నా—మాయింటి వెనకాల పెద్దమర్రిచెట్లున్నాయి—ఆచెట్లవూడలు భూమిలోకిదిగి పెద్దఆకుల్లేని మ్రానుల్లాగ కనిపిస్తాయి. ఆచెట్లనీడను కూర్చుంటే పోయినప్రాణం తిరిగొస్తుంది.

తనభార్యయు, నాబాల్యస్నేహితురాలునైన సురబాలతో రామలోచన్ స్కూలుకుకొంచందూరంల్లో ఉన్న ఒకయింట్లో కాపురంవున్నాడు. రామలోచనకు నాకు పరిచయంకలిగినప్పటికి సురబాల నాస్నేహితురాలని అతనితో నేచెప్పలేదు. అల్లాచెప్పటం మంచిదికాదనుకొన్నాను.

'ఇప్పుడు సురబాలకు నాకు ఉన్నసంబంధంయేవిటి?' అనేవిషయం నన్నుబాధిస్తూండేది. ఒకరోజున యేంతోచక రామలోచను యింటికివెళ్లేను. మేమిద్దరం మాతృదేశదుస్థితిగూర్చి ముచ్చటిస్తున్నాం. నావుద్రేక

1072

పూరితమైన గంభీరోపన్యాసానికి రామలోచన విస్మితుడయ్యాడు. రెవరైనా సరే! మనదేశమునుగూర్చి కాస్సేపు ఆలోచించినట్లయితే 'అయ్యో! దేశము యింత హీనస్థితిలోనికి వచ్చిందే!'' యని అనుకోనకపోరు. మేమిద్దరం యిట్లా మాట్లాడుతూవుండగా నే—

ప్రక్కగదిలోంచి మంజీరమురుగుల శ్రావ్యధ్వని—చీరమడతల సవరణశబ్దం—భయవిహ్వలమైన పాదపతనము—వినవచ్చేయి. కిటికీసందునుండి ఆతురతతో చలించుచున్న నయనములజంట నన్ను పరీక్షిస్తోందని అనుకున్నాను. తక్షణం నామనస్సునందొకవికాసంకలిగింది. మెరుంగుకనుంగవలు—వికాసముతో నిండుకొన్నాయి. ఉదారత్వంతో, నిరాడంబరంతో, కృతజ్ఞతతో, బాలికకు సహజమైన ప్రేమతో నిండుకొన్న ఆమెనయనములజంటను నామనోనయనం జూచింది. అప్పుడు ఒక్కమాటుగా నాహృదయం క్రుంగిపోయి చెప్పరానిబాధను కలిగించింది. నేను నా ఆశ్రమానికి చేరుకున్నాను. కాని హృదయభారము కాస్తాకూడా తగ్గలేదు. ఏపుస్తకమైనా చదివితే తగ్గుతుందని అల్లా చేసేను. లాభంలేకపోయింది. పోనీ వ్రాయటంవల్ల కాస్త బాధశమిస్తుందేమో అనుకుంటే మరీలాభంలేకపోయింది. నాహృదయం గొడ్డలివ్రేట్లకు గురిఅయింది. ఏలాగో కొంచంమనశ్శాంతి కావించుకొని నన్నింతగాబాధించే దేవిటా అనుకొన్నాను అపాయింత్రం—

నీసురబాల యెక్కడుంది? అని లోనుండి అంతరాత్మ ప్రశ్నించింది. సురబాల నాజీవితకాలమంతా నాతోయుండాలని నాఆశయంకాదని జవాబిచ్చాను.

అంతరాత్మ:—సురబాల నాది అని నీవు ఇదివరలో ఒక్కసారి అనియున్నట్లయితే ఆమెను నీవద్దకు తెచ్చుకొని యుండెడివాడవు—ఇప్పుడో నీవు సురబాలనుగురించి మాట్లాడగూడదు. అట్లుచేయుట వీలులేదు సరికదా ఆమెను కన్నెత్తిచూచుటకైనా నీవిప్పుడు అర్హుడవుకావు. సురబాలయొక్క మంజీరగాజుల ధ్వనివినగాగలవు. ఆమెయొక్క కృతజ్ఞతావీక్షణములనందుకోనా గలవు. కాని నీకు ఆమెకు మధ్య ఒక మహాసముద్రం అడ్డువుంది.

"పోనీ! సురబాలెవరు, నేనెవర్ని?" అని అన్నాను.

అంతరాత్మ:—"సురబాలకీ నీకు యిప్పుడేవిధమయిన సంబంధంలేదు. అప్పుడు సురబాలా! నీవు నాదానవు అని అన్నట్లయితే ఆమెనీకన్నివిధాలా ఉపకారిగావుండేదే! నిజమే? అన్నివిధాల నీతోడునీడైయుండేది. నాకందరికంటె యిష్టురాలై నాకష్టసుఖాల్లో భాగంపంచుకొంటూ యుండేది. కాని యిప్పుడో! సురబాలకు-నాకు యేవిధమయిన సంబంధంలేదు. కన్నెత్తిచూట్టానికైనా వీల్లేనటువంటి పరాయివాణ్ణయ్యాను. పోనీ! మాట్లాడదామా అంటే మరీతప్పు. పోనీ బాల్యస్నేహితురాలైన సురబాలను కాస్సేపుతలుచుకొందామా అంటే మహాపాపం. మొన్నటివరకు సురబాలంటే యెవరో యెరక్క. యేనైపునుండో అకస్మాత్తుగావచ్చి అసందర్భంగా రెండుమంత్రాలు చదివించి రామలోచనను, సురబాలను వివాహం చేసుకొన్నాడు! యెందుకు? ఇదంతా తలుచుకుంటే గర్భనిర్భేదమవుతుంది. ఇంతకీ! నేనిక్కడికి ఒకసంఘాన్ని సంస్కరించాలనిగాని, క్రొత్తమతసాంప్రదాయములను ప్రవేశపెట్టాలనిగాని రాలేదు. వాళ్లిద్దరు హాయిగావుంటే అదేపదివేలునాకు. నేచెప్పిందంతా మీకు అసమంజసంగాతోచవచ్చును. రామలోచను ఇంట్లోవున్నసురబాల నాకు వానికంటె దగ్గరహితురాలుకాదూ? ఈసంగతిమట్టుకు నామనస్సు ఎప్పుడూమరువదు. నాయీవూహసమంజసమైనదికాదనియు సకారణమైనదికాదనియు నేనెరుగుదును. కాని అది అస్వాభావికమైనది కాదనికూడాయెరుగుదును.

౫

నాకుయేపని చేయటానికీకూడా బుద్ధిపుట్టేదికాదు. ఒకనాడు మధ్యాహ్నమప్పుడు నేక్లాసులో కూర్చున్నప్పుడు పిల్లలల్లరిచేస్తూంటే ప్రకృతంతా సాయంకాలపుచల్లనియెండలో ప్రకాశిస్తూంటే చల్లని

1073

సౌగంధిక వాయువులు హాయిగా ప్రసరిస్తోంటే నామనస్సునందొక అనుమానము తోచింది. "ఈబడిబంతులు బ్రతుకెన్నాళ్లు" మనుకొన్నాను. బడివదలినతర్వాత సాయంకాలం ఒక్కణ్ణీ కూర్చొని కాలాన్ని వెళ్లబుచ్చటానికి చాలా చిరాగ్గాయుండేది. సరే! యెవరైనా పాపం! నాతో మాట్లాట్టానికివస్తే నాకు మరీబాధగా యుండేది. ఎల్లాగో చెరువుగట్టుమీద కూర్చొని ఆచెట్లనుండివచ్చే గాలులననుభవిస్తూ చిన్నకెరటాలకి కంగారుపడి చెదరి ప్రకృతిసౌందర్యాన్నిచూచి ఆనందిద్దామని పైకివచ్చేచేపలను పక్షులు యెగురవేసుకు పోవటం చూస్తూండేసరికి నాకు మనస్సులో ఒకసంశయం తట్టింది. "మానవసృష్టంతా తప్పులమయమే కదా! తనకు కావలసినవస్తువు కాళ్లదగ్గరకు వచ్చినప్పుడు లక్ష్యపెట్టక అది కాస్తా దాటిపోయిన తర్వాత దానికోసం విశ్వప్రయత్నాలు చేయటం—ప్రతిమానవునకు స్వభావం కదా!" అనుకున్నాను. అప్పట్లో వివాహమాడి, సురబాలతో హాయిగా సంసారంచేయవలసిందేమరి! కాని యేగాంధీనో, మేజినీనో, గరిబాల్డీనో అవుదామని నాఆశయం—మ్యాట్రిక్యులేషన్ మాష్టరుపనిరాగానే యీ ఆశయంకూడా అడుగంటింది.

పెండ్లికాక పూర్వం సురబాల యెవరికో ఆమెరూపమెట్టిదో యెరక్క సురబాలను అందరు స్త్రీలవలనే చూచుకొనుచున్న రామలోచనుకు ఆమెను పరిగ్రహించటానికి యేమిహక్కుంది? రామలోచనుకు యేవిధమైన మనస్తాపంలేదు కాబోలు—అతనికి ప్రకృతి సౌందర్యమును ఆనందించటం తెలియదు—లేకపోతే యీ చెరువుగట్టుమీద కెందుకురాడు? అతనికంతకంటె ప్రాప్తిలేదు కాబోలు!—

## ౬

రామలోచను ఒకపెద్దకేసుపనిమీద ఒకమాటు ఒకపట్నంవెళ్లవలసివచ్చింది. నేను నాయింట్లో ఎట్లా యేకాకినైయున్నానో సురబాలకూడా అంతే! ఆవేళ సోమవారం. ప్రొద్దుట్నించీకూడా మబ్బుగావుంది. పదిగంటలనుంచి తుషారం మొదలిడింది. ఆవేళ మాబడికి సెలవు. ఆకాశంమీద మేఘాలు చిందరవందరగా పరుగెత్తుచు చూచేవాళ్లకి చాలాఆనందాన్ని కలిగిస్తున్నాయి. మొర్నాటి ప్రొద్దుటికి వర్షం ఎక్కువయింది—తుపాను!...గాలి రివ్వున ఈచెవినుండి ఆచెవికి వీస్తోంది. ఇంతగాఢమైన మబ్బుల్లో భీభత్సంగావున్న మహావాయువుల్లో అయ్యో!—సురబాల ఒంటరిగావుంది.

సురబాల యింటికంటె మాబడిబంగాళా చాలాగట్టిది. సురబాలను—మ్యాట్రిక్యులేషన్ బంగాళాకు తీసికొచ్చి సురక్షితంగావుంచి—అవసరమయితే నేను చెరువుగట్టునయినాయుంటానికని నిశ్చయించుకొన్నాను. కాని ఆమెను పిలుచుటకు చాలినధైర్యంయేదీ? రాత్రిఒంటిగంటన్నర—నిమిష నిమిషానికి మెరపులు—వాటివెనకాలే హృదయకుహరాల్ని పగిల్చేపిడుగులు—వీటికితోడు సముద్రపుకెరటాలహడావిడి. ప్రకృతి యింత భయంకరంగావుంది.

## ౭

తక్షణంసురబాల యింటికేసి పరుగెత్తేను. మధ్యదోవలో ఒకయేరుంది. ఆయేట్లో నీరు అప్పుడే మోకాల్లోతువరకు ప్రవహిస్తూంది. నేను నెమ్మదిగా యేరుదాటి అవతలగట్టుకి వెడ్తోంటే మధ్యలో ఒకకెరటము వచ్చి నాగుడ్డల్నితడిపివేసింది. ఇంకా నేను ఏటిగట్టుయెక్కనైనా లేదు. దానియెత్తు రమారమి రెండునిలువులుంటుంది. నెమ్మదిగా గట్టెక్కటానికి ప్రయత్నిస్తున్నా—ఒకవ్యక్తిని చూడగానే నాదేహం కంపించింది. నామనస్సు కలతపడి పరిపరివిధాలపోయింది. హృదయం క్రుంగిపోయింది. ఆనిలబడినవ్యక్తి యెవరో నాదేహంలోవున్న ప్రతిరక్తనాళానికికూడా తెలుసును. సందేహంలేదు. ఆవ్యక్తికూడా నన్నుగుర్తించివుంటుంది. ఏటివరద క్షణక్షణానికి యెక్కువైపోతోంది. మేమొక యిసుకతిప్పమీద నిలబడ్డాం. చుట్టూనీరు.

మాయిద్దరిమధ్య మూడుగజాలదూరం వుంటుంది. ప్రవాహం హెచ్చిపోతోంది—ఆకాశమంతా వెతికినా ఒక నక్షత్రంకూడా కనబడ్డంలేదు. ప్రపంచమంతా గాఢాంధకారంతో నిండిపోయింది. మేముయిద్దరమూ ఆసమయాన్ని మాట్లాడుకోన్నా మమ్మల్నెవరు వారించేవారు? కాని మాకేమాట్లాట్టానికి ధైర్యంలేదు. ఒకరినొకరు కుశలప్రశ్నకూడా వేసుకోలేదు. ప్రవాహంయొక్క ఉద్రేకంచూట్టానికికూడా భయంగావుంది. ఆప్రవాహంల్లోపడితే జీవితాశసున్న. ఈవాళ, ఆమెప్రపంచము ఒదిలేసి నాప్రక్కనిలబడింది. చిన్నప్పుడు దేవకన్యలాగ రెుప్పుడూ నాప్రక్కనే నిలుచునేది. ఆరోజులు యిప్పటివా? యీవేళ ప్రపంచమునువిడిచి యీమహాంధకారమునందు—యీనిర్జనప్రదేశమునందు—యీ వుద్రేకభయంకరవాహిని ముందు-నాప్రక్క-నాప్రక్కనే నిలబడింది. ఇంకొక్క కెరటమువస్తేచాలు-మేమింక యీలోకమున వుండము—భగవంతుడు సురబాలను రక్షించుగాత! ఆమె కాయురారోగ్యములను చేకూర్చుగాత!

౫

ఈరాత్రి—ఈయేకరాత్రి—భయంకరమృత్యుసమానమైన రేయియందే నేనునాజీవితమున బొందని స్వర్గసౌఖ్యమును బొందితిని.

సుప్రభాతమైంది—తుఫాను ముగిసింది. వరదలు తగ్గేయి. ఇద్దరంకూడా ఒక్కమాటైనా మాట్లాడుకోకుండా సురబాల ఆమెయింటికి నేను నాఆశ్రమానికివచ్చేము. ఇంటికొచ్చి ఆలోచించేను. కోర్టువంటా ఉద్యోగంచేయులేదు. గాంధీనిగాని, మేజినీనిగాని, గరిబాల్డీనిగాని కాలేదు. మరి నేనుచేసిన ఉద్యోగం యేమిటి?—బడిపంతులపని.

౬

కాని ఆనాటిరేయియందు నేపొందిన ఆనందము నాభారమైన జీవయాత్రను సుఖపరుపగలదు.

ఆనాటినిశయే—నాభారభమగు జీవయాత్రకంతకును ఆహ్లాదమునుకలిగించిన మహత్తరమయినరేయి.

## గృహలక్ష్మి

చెరుకుపల్లి శివరామయ్యగారు (సాహిత్యమండలి)

ప్రణయమత్తద్విపేంద్రంబుఁబంధింపంగ లావణ్యవతి శృంఖలానిభంబు
అజ్ఞానవిషకంటకారణ్యతలమందు కాంతయే నవమల్లికాసుమంబు
ప్రాప్తసంకటవారివాహసంఘమువిప్ప వనితయే ఝంఝాప్రభంజనంబు
కందర్పశరతాపగాఢాంధమునడంప సతివయే పూర్ణచంద్రాతపంబు
మదనసామ్రాజ్యపదవికి మధురవాణి పట్టపుందేవి సంతానభాగ్యనిత్య
వైభవసమంచితారామవాటికలకు సంగనామణియే వసంతాగమంబు.
మధుమాసవేళలేమావిగున్నపైన నెలుగెత్తిపాడు కోయిలనుమించి
అలవోకముద్దుమాటలబల్కు శుకశారికాగణంబులను చీకాకుఁబరచి
ప్రావృషేణ్యపయోధరశ్రేణి వెలుగొందు భవ్యవిద్యుల్లతాప్రభవహించి
శరదాగమంబున సంపూర్ణపూర్ణిమాచంద్రాతపంబుతో సరసమాడి
ప్రీతిగొలిపించు సరససంగీతవాక్యరమ్యలావణ్యహాసాంకురములనెపుడు
సుధలజిమ్ముచు ధవుమనోరథమెఱింగి బలుగుతరుణియె సంసారతరణి ధరణి.

1075